క్లుప్తంగా

నేడు ఆలయాల మూసివేత

సీటీఆర్ఐ: చంద్రగ్రహణం సందర్భంగా స్థానిక ఉమా మార్కండేయేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం ఉదయం 11 గంటలకు మూసి వేస్తామని కార్యనిర్వాహణాధికారి ఆర్.శ్రీనివాస్ తెలిపారు. తిరిగి ఆదివారం ఉదయం ఆరు గంటలకు తెరుస్తామన్నారు. అలాగే పుష్కరఘాట్‌లో గోదావరికి జరుగుతున్న నిత్య హారతి కార్యక్రమాన్ని శనివారం రద్దు చేసినట్టు నిత్యహారతి పర్యవేక్షక అధికారి, పందిరి మహాదేవుడు సత్రం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వీవీ పల్లంరాజు తెలిపారు. తిరిగి ఆదివారం రాత్రి 6.30 గంటలకు యథాతథంగా కార్యక్రమం జరుగుతుందన్నారు.

మహిళా కారాగారం సందర్శన



మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: రాజమహేంద్రవరం మహిళా కేంద్ర కారాగారాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) చైర్మన్, న్యాయమూర్తి కె.ప్రత్యూష కుమారి శుక్రవారం సందర్శించారు. కారాగారంలో వసతులు, సదుపాయాలను పరిశీలించి అక్కడున్న మహిళా ఖైదీలతో మాట్లాడారు. వారికి వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయ సంబంధమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలున్నా పారా లీగల్ వలంటీర్ ద్వారా జిల్లా న్యాయసేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు. ప్రత్యేకంగా ముద్దాయిలకు, ఖైదీలకు న్యాయసేవలందించేందుకు పనిచేస్తున్న లీగల్ ఎయిడ్ సిస్టమ్ గురించి వివరించారు.

ఉత్సాహంగా ఫిట్ ఇండియా ఫ్రీడం రన్

కంబాలచెరువు: స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఎస్‌కేఆర్ కళాశాల విద్యార్థులు శుక్రవారం ఫిట్ ఇండియా స్వచ్ఛత ఫ్రీడం రన్ 4.0 నిర్వహించారు. కళాశాల నుంచి కంబాలచెరువు వద్ద దండిమార్చ్ విగ్రహాల వరకూ ఈ కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ రాఘవ కుమారి మాట్లాడుతూ విద్యార్థినులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే మంచి సమాజ నిర్మాణం జరుగుతుందని, దానికోసం ఇలాంటి కార్యక్రమాలు అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల కోఆర్డినేటర్లు డాక్టర్ పి.శ్రీవల్లి, ఎం.కాస్మా, పి.శ్రీదేవి, కె.చిన్నిబాబు, ఎం.వెంకాయమ్మ పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల అంచనాకు సీస్ పరీక్ష



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఐ దిలీప్ కుమార్

కంబాలచెరువు: స్టేట్ ఎడ్యుకేషనల్ ఎచీవ్ మెంట్ సర్వే (సీస్) పేరుతో విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు వచ్చేనెల మూడో తేదీన ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రత్యేక పరీక్ష నిర్వహిస్తున్నట్టు అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ తెలిపారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి విధి విధానాలను వివరించారు. సీస్ పరీక్షను 3, 6, 9 తరగతుల విద్యార్థులకు గణితం, తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో నిర్వహిస్తామన్నారు. డిగ్రీ, డీఎడ్, ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులను ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు పేరుతో వినియోగించడం జరుగుతుందన్నారు. ఏదైనా పాఠశాలలో నవంబర్ 3న తేదీన జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతున్నట్టైతే ముందుగా తమకు తెలియచేయాలని, తదనుగుణంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు. సమావేశంలో అర్బన్ ఎంఈఓ 2 రమా రజని, సీఆర్పీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, పబ్బినీడి ప్రసాద్, కుమారి, నీలిమ, నాగలక్ష్మి, కోటేశ్వరి, ఇందిర పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విజేతలైన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

కడియం: చేనేత వస్త్రాలపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం స్థానిక కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ మండల స్థాయి పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ అభినందనలు తెలిపారు. గొల్లవిల్లి సత్యనారాయణ పోటీలు నిర్వహించగా, న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు శరత్ బాబు, సుబ్బారావు, సుధాకర్, చందురెడ్డి, శ్రీనివాస్ వ్యవహరించారు. మండల విద్యాశాఖాధికారులు వి.లజపతిరాయ్, వై.నాగేశ్వరరావు మాట్లాడుతూ మండల స్థాయిలో విజేతలు శనివారం జరిగే జిల్లా స్థాయి పోటీలకు హాజరుకావాలన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో పతకాల పంట

- సత్తాచాటుతున్న క్రీడాకారులు
- స్టేట్ చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

ప్రకాశం నగర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధిస్తున్నారు. ఇటీవల అనంతపురంలో జరిగిన ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ అండ్ స్టేట్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో నగరానికి చెందిన పలువురు క్రీడాకారులు తమ సత్తాను చాటి వెండి, కాంస్య పతకాలు సాధించారు. పురుషుల విభాగంలో టి.ప్రభాత్ సాయి, ఏడీ మణికంఠ, మంజు అవినాష్, బి.తనుష్, చరణ్ కార్తిక్ విజయం సాధించారు. మహిళల విభాగంలో వై.వైష్ణవి సూర్య, ఛార్వి ఫాల్గున్, జి.సిరి పావని, పి.శ్రీలక్ష్మి, జి.తాన్యశ్రీ విజయకేతనం ఎగురవేశారు. వీరితో పాటు అండర్ – 17 బాలుర విభాగంలో బి.సాయి జోషిత్, ఎస్.లోహిత్ సూర్య, ఎస్.మోహిత్ శ్రీ కపిష్, కె.గౌతమ్ కాంస్య పతకాలు సాధించారు.

రాష్ట్ర స్థాయిలో తొలి రెండు ర్యాంక్‌లు

గౌతమీ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ క్రీడాకారిణి జి.సిరి పావని అండర్ – 17 బాలికల వ్యక్తిగత విభాగంలో విజయం సాధించి చాంపియన్‌షిప్ గెలుచుకుంది. అలాగే అండర్ – 15, అండర్ – 19 బాలికల విభాగంలో కాంస్య పతకాలు సాధించి ఏపీ స్టేట్ అండర్ 15, 17 బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. పురుషుల విభాగంలో టి.ప్రభాత్ సాయి కాంస్య పతకం, అండర్ – 19 బాలుర విభాగంలో వెండి పతకం సాధించాడు. అండర్ – 19 విభాగంలో రాష్ట్రంలో మొదటి స్థానం, పురుషుల విభాగంలో 2వ స్థానం సంపాదించాడు. వీరితో పాటు చార్వి ఫాల్గున్ అండర్ – 19 బాలికల విభాగంలో వెండి పతకం, వై.వైష్ణవి సూర్య మహిళల విభాగంలో కాంస్య పతకం సాధించి ఆ విభాగాలకు చెందిన జట్లలో స్థానం సంపాదించారు.

పలువురి అభినందనలు

రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు విశ్వనాథం భాస్కరరామ్, అధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి, కోశాధికారి కె.సత్యనారాయణ, కోచ్ వీటీవీ సుబ్బారావు అభినందించారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఆనందంగా ఉంది



అండర్ – 17 బాలికల వ్యక్తిగత విభాగంలో విజయం సాధించడంతో పాటు, చాంపియన్‌షిప్ సాధించడం ఆనందంగా ఉంది. గౌతమి టేబుల్ టెన్నిస్ అసోసియేషన్‌లో వీటీవీ సుబ్బారావు మంచి శిక్షణ ఇస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి, జాతీయ పోటీల్లో రాణించడమే ధ్యేయంగా శిక్షణ తీసుకుంటున్నాను.

– జి.సిరిపావని

తండ్రి ప్రోత్సాహం



నా తండ్రి తీగిరెడ్డి బాపిరాజు ప్రోత్సాహంతో టేబుల్ టెన్నిస్‌లో అడుగు పెట్టాను. ఎనిమిదేళ్ల వయసు నుంచీ జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీల్లో రాణించి, పలు పతకాలు సాధించాను. ఇంటర్ ద్వితీయ ఏడాది పరీక్షలు రాశాను. ఆటతో పాటు చదువునూ ఆస్వాదిస్తున్నాను. అండర్ – 19 విభాగంలో రాష్ట్రంలో మొదటి స్థానం రావడం ఎంతో ఆనందంగా ఉంది.

– ప్రభాత్ సాయి

ఎడ్యుకేషనల్ సర్వే ఇన్విజిలేటర్లకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న కడియం ఎంఈవో లజపతిరాయ్

రాజమహేంద్రవరం రూరల్: స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే 2023 నిర్వహణకు సంబంధించి ఇన్విజిలేటర్లకు శుక్రవారం బొమ్మూరులోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో శిక్షణ నిర్వహించారు. జిల్లా విద్యా శిక్షణాసంస్థ (డైట్) ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేవీ సూర్యనారాయణ అధ్యక్షతన ఇన్విజిలేటర్లుగా నియమింపబడిన డైట్ ఛాత్రోపాధ్యాయులకు శిక్షణ ప్రారంభించారు. కేవీ సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాలను తెలుసుకునేందుకు విద్యాశాఖ సన్నద్ధమైందన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన 3, 6, 9 తరగతుల విద్యార్థులు ఈ సర్వేలో భాగస్వాములు కానున్నారన్నారు. సర్వే రిసోర్స్‌పర్సన్, డైట్ లెక్చరర్ కె.గంగాధరరావు మాట్లాడుతూ నవంబర్ మూడున రాష్ట్రంలోని 27 వేల పాఠశాలల్లో ఈ సర్వే నిర్వహించబడుతుందన్నారు. కార్యక్రమంలో రూరల్, కడియం మండల విద్యాశాఖాధికారులు ఏఆర్‌కే తులసీదాస్, వి.లజపతిరాయ్, కె.చందుకుమార్, వై.నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.ప్రియదర్శిని పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా కమిటీ నియామకం

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా నూతన కమిటీని నియోజక వర్గాల వారీగా ప్రకటించినట్లు జిల్లా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరామ్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నగరంలో నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. కమిటీలో ఉపాధ్యక్షులుగా అసెంబ్లీ వారీగా పిల్లాడి రుద్రయ్య (రాజమహేంద్రవరం సిటీ), మట్టా నాగబాబు (రాజమహేంద్రవరం రూరల్), గౌరపర్తి వెంకటేష్ (నిడదవోలు), బొట్టా శ్రీరామకృష్ణ (గోపాలపురం), దొడ్డిపట్ల నారాయణ (కొవ్వూరు), రుత్తుల చినబాబు (రాజమహేంద్రవరం సిటీ), ప్రధాన కార్యదర్శులుగా మన్నెం శ్రీనివాస్ (రాజమహేంద్రవరం రూరల్), కట్టుంగ అచ్చియ్య (నిడదవోలు), కార్యదర్శులుగా తల్లోజు లోవ ప్రసాద్ (రాజానగరం), సత్యశేష ఆళ్వార్ (గోపాలపురం), పైపూరి మాణిక్యాలరావు (నిడదవోలు), కానుబోయిన నాగేశ్వరరావు (గోపాలపురం), కుక్కల వీర వెంకట సత్యనారాయణ (అనపర్తి), కట్టుంగ కంచెశ్వరరావు (నిడదవోలు), కోశాధికారిగా పరిచారి నరసింహమూర్తి (రాజానగరం), కార్యవర్గ సభ్యులుగా ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల నుంచి నియమించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కురగంటి సతీష్ పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం సంజీవయ్య నగర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బర్మా కాలనీకి చెందిన కప్పల కోటేశ్వరరావును శుక్రవారం ఎస్ఈబీ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ అరెస్టుచేశారు. అతడి నుంచి 180 ఎంఎల్ తొమ్మిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన



డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. పిడింగొయ్యి గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీనగర్‌లో శుక్రవారం రూ.20 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ పిడింగొయ్యి గ్రామ సచివాలయం–2 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లినప్పుడు ప్రజలు చెప్పిన సమస్యలను విడతల వారీగా ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించడం జరిగిందన్నారు. దానిలో భాగంలో లక్ష్మీనగర్‌లో రూ.20 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో హుకుంపేట సొసైటీ చైర్ పర్సన్ బొప్పన సుబ్బారావు, పార్టీ నాయకులు పడాల వీర రాఘవ రెడ్డి, చీరా రాజు, సిరసపల్లి శంకరరావు, కె.లక్ష్మీనారాయణ, మేడి త్రిమూర్తులు, పంచాయతీ కార్యదర్శి ముదునూరి రూప్‌చంద్ పాల్గొన్నారు.

పూర్తి నాణ్యతతో రహదారి పనులు



పనుల వివరాలను కలెక్టర్ మాధవీలతకు వివరిస్తున్న అధికారులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి విజ్జేశ్వరం వరకూ జిల్లాకు సంబంధించిన రహదారి పనుల కోసం రూ.25 లక్షలు కేటాయించారని, ఆ నిధులతో పూర్తి నాణ్యతతో మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ మాధవీలత స్పష్టం చేశారు. బ్యారేజీ వద్ద ప్రతిపాదించిన రహదారి పనులను శుక్రవారం సాయంత్రం ఇరిగేషన్, రవాణా, పోలీస్ అధికారులతో కలసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యారేజీ రహదారి ప్రాంతంలో రూ.25లక్షల నిధులతో చేపడుతున్న పనులు పురోగతిపై క్షేత్ర స్థాయిలో పరిశీలించడం జరిగిందన్నారు. నాణ్యత విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అలక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు. ఆర్‌సీఆర్‌బీ (రోడ్ కం రైల్ బ్రిడ్జి) పనులను పూర్తి నాణ్యత ప్రమాణాలతో చేపట్టడం జరుగుతుందన్నారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్ కాశీ విశ్వేశ్వరరావు, డీఈ యు.రమేష్, జిల్లా రవాణా అధికారి కేవీ కృష్ణారావు, జిల్లా మైన్స్ అధికారి ఎం.సుబ్రహ్మణ్యం, ఇరిగేషన్ ఏఈ ఐ.సాయిరామ్ పాల్గొన్నారు.

నగరంలో శరవేగంగా అభివృద్ధి పనులు

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్
- డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన



క్షేత్రస్థాయిలో సమస్యలు పరిశీలిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో అభివృద్ధి పనులు ప్రణాళికాబద్ధంగా జరుగుతున్నాయని, దానిలో భాగంగా డ్రైనేజీలు, రోడ్లు, సెంటర్ డివైడర్లు, జంక్షన్లను అభివృద్ధి చేస్తున్నట్టు వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 6వ డివిజన్ తోటవీధిలో రూ.19 లక్షలతో నిర్మించే డ్రైనేజీకి ఆయన, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ ఎంపీ మార్గాని భరత్ రామ్ నేతృత్వంలో కార్పొరేషన్ నగరంలో ప్రణాళికాబద్ధ అభివృద్ధికి శ్రీకారం చుట్టిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నగరానికి రూ.125 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించడంతో భారీ స్థాయిలో అభివృద్ధి జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి బురిడి త్రిమూర్తులు, గృహ సారథులు పాల్గొన్నారు.

24వ డివిజన్‌లో పర్యటన

ప్రజలకు ఇబ్బందికరంగా మారిన శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లను తొలగించి రక్షణ కల్పించాలని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ నగర పాలక సంస్థ అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక 24వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, మాజీ కార్పొరేటర్ అరవ సురేష్ ఆధ్వర్యంలో పర్యటించారు. స్థానికులు తెలిపిన డ్రైనేజీలు, వీధిలైట్ల సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ బెజవాడ రాజ్ కుమార్ తదితరులు ఉన్నారు.

సచివాలయాల సందర్శన

స్థానిక 38, 39, 40, 42 డివిజన్లలోని సచివాలయాలను సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ శుక్రవారం ఆయా డివిజన్ ఇన్‌చార్జులతో కలిసి సందర్శించారు. డివిజన్ పరిధిలోని పలు సమస్యలపై క్షేత్రస్థాయిలో సమీక్షించారు. నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, క్లస్టర్ ప్రెసిడెంట్ మజ్జి అప్పారావు, డివిజన్ ఇన్‌చార్జులు అరిగెల బాబు, దుంగా మంగ, నామన వాసు, లంకా ప్రసాద్ పాల్గొన్నారు.

కొత్త తరహా కథతో నరకాసుర



మాట్లాడుతున్న హీరో రక్షిత్, చిత్రంలో హీరోయిన్లు అపర్ణ, సంకీర్తన, దర్శకుడు సెబాస్టియన్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రొటీన్ కథలకు భిన్నంగా కొత్త తరహా కథతో నరకాసుర చిత్రాన్ని తెరకెక్కించామని హీరో (పలాస ఫేమ్) రక్షిత్ అట్లూరి అన్నారు. ఆ చిత్ర ప్రమోషన్‌లో భాగంగా శుక్రవారం స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులోని ఓ రెస్టారెంట్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. హీరో రక్షిత్ మాట్లాడుతూ కుటుంబంతో కలిసి తిలకించే విధంగా నరకాసుర చిత్రం ఉంటుందన్నారు. పలాస ఘన విజయం సాధించిన తర్వాత కూడా తదుపరి చిత్రానికి ఎక్కువ గ్యాప్ రావడానికి కారణంగా నరకాసుర చేయడం వల్లే అన్నారు. మరో రెండు చిత్రాలు పూర్తవుతున్నాయని, రెండు, మూడు నెలల వ్యవధిలో అవి కూడా విడుదల కానున్నాయన్నారు. నవంబర్ మూడున నరకాసుర విడుదల అవుతుందని, ఐదు భాషల్లో చిత్రాన్ని తెరకెక్కించడం జరిగిందన్నారు. దర్శకుడు సెబాస్టియన్ మాట్లాడుతూ కొత్త విజువల్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా నరకాసురను తెరకెక్కించామన్నారు. హీరోయిన్లు సంకీర్తన, అపర్ణలు మాట్లాడారు.

30 నుంచి సీపీఎం బస్సుయాత్ర



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అరుణ్ తదితరులు

ప్రకాశం నగర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ అవలంబిస్తున్న నిరంకుశ విధానాలను ప్రజలకు వివరించి, వారిలో చైతన్యం తేవడమే లక్ష్యంగా సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి బస్సు యాత్ర ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్ తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి ఒక యాత్ర, శ్రీకాకుళం జిల్లా మందస నుంచి రెండో యాత్ర, రాయలసీమలోని కర్నూలు నుంచి మూడో బస్సుయాత్ర ప్రారంభమవుతుందన్నారు. నవంబర్ 6వ తేదీన బస్సుయాత్ర రాజమహేంద్రవరం చేరుతున్న సందర్భంగా ప్రజా రక్షణ భేరి పేరుతో సభ నిర్వహిస్తామన్నారు. ముగింపు సందర్భంగా విజయవాడలో నవంబర్ 15వ తేదీన భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఆ సభకు పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు బి.రాఘవులు తదితర నాయకులు హాజరవుతున్నారన్నారు. అనంతరం ప్రజాప్రణాళిక పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ నాయకులు బి.పవన్, జె.రాంబాబు, ఎస్ఎస్ మూర్తి, బి.రాజులోవ పాల్గొన్నారు.

సురక్ష శిబిరాలతో పేదలకు మేలు



కడియంలో మందులు పంపిణీ చేస్తున్న కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్



పిడింగొయ్యిలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అనసూరి పద్మలత

- ఏపీజీఅండ్‌బీసీ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్
- శిబిరాల్లో పలువురికి వైద్యసేవలు

కడియం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. శుక్రవారం కడియం గ్రామ సచివాలయం–2 పరిధిలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అక్కడ జరుగుతున్న వైద్య పరీక్షలను, మందుల పంపిణీ కౌంటర్లను పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు. రోగులకు మందుల కిట్లు పంపిణీ చేశారు. స్పెషలిస్టు వైద్యులు కేఎల్ మాధురి, కె.చల్లారావు, కడియం పీహెచ్‌సీ వైద్యులు మణిజ్యోత్స్న, ఎస్ఎస్ఎస్ మౌర్య వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 591 మందికి వైద్యసేవలు అందించగా, 16 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రిలకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రత్నకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల వీర్రాజు (బాబు), జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల చక్రవర్తి, ఎంపీటీసీ బొట్టు చిన్ని, సచివాలయం – 2 కన్వీనర్లు ఆర్ఎస్ఎస్ మూర్తి, దాసరి నాగేంద్ర, కావలా వెంకన్న, పాలపతి సింగ్, ఓగిరాలరాజు, లావేటి రమేష్, పూడి బ్రహ్మం, మలకల దొరబాబు, కొమ్ము సత్తిబాబు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

రాజమహేంద్రవరం రూరల్: సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రాష్ట్రంలోని పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించిందని వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత అన్నారు. పిడింగొయ్యి –2 గ్రామ సచివాలయం పరిధిలోని వెంకటగిరి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు రొమ్ము క్యాన్సర్ రాకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పౌష్టికాహారం వల్ల ప్రయోజనాలను వివరించారు. ముందుగా ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. స్పెషలిస్టు వైద్యులు లాస్యసింధు, వినీత, పీహెచ్‌సీ వైద్యులు జి.రోహిత, ఈ.నాగదేవి, ఎన్.జెస్సీ సుప్రియ వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో 504 మందికి వైద్య సేవలు అందించగా 21 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. పంచాయతీ కార్యదర్శి ముదునూరి రూప్‌చంద్, హుకుంపేట సొసైటీ చైర్‌పర్సన్ బొప్పన సుబ్బారావు, సచివాలయ కన్వీనర్లు పడాల వీరరాఘవ రెడ్డి, శిరసపల్లి శంకరరావు, కె.లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీ పిల్లా లక్ష్మణరావు, పార్టీ నాయకులు మేడి త్రిమూర్తులు, చీరా రాజు పాల్గొన్నారు.

భగవంత్ కేసరి చిత్ర బృందం సందడి



అనుశ్రీ సినిమాస్‌లో సందడి చేసిన దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్ శ్రీలీల

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): భగవంత్ కేసరి సినిమాను ప్రజలు ఆదరించి, అద్భుత విజయాన్ని అందించారని ఆ చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. తాను దర్శకత్వం వహించిన ఏడు సినిమాలను ఆదరించడమే కాకుండా ఈ సినిమాను బ్లాక్ బస్టర్ చేసినందుకు ఆనందంగా ఉందన్నారు. నందమూరి బాలకృష్ణ హీరోగా షైన్ స్క్రీన్స్ పతాకంపై నిర్మించిన భగవంత్ కేసరి సినిమా విజయ యాత్రలో భాగంగా శుక్రవారం సాయంత్రం స్థానిక అనుశ్రీ సినిమాస్‌కు ఆ చిత్ర బృందం విచ్చేసింది. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రీలీల కేక్ కట్ చేసింది. నిర్మాతలు సాహు గారపాటి, హరీష్ పెద్ది, నటులు మురళీధర్, జీవన్ కుమార్ హాజరయ్యారు. తొలుత చిత్రబృందానికి డప్పు వాయిద్యాలతో చిత్ర పంపిణీ దారులు, మైత్రి ఫిలిం డిస్ట్రిబ్యూటర్లు రాయుడు, ఉదయరాజు, సత్తిరెడ్డి, అనుశ్రీ సినిమాస్ హరిబాబు, విష్ణు, రాజు, జిల్లా ఫిలిం డిస్ట్రిబ్యూటర్ల కార్యదర్శి, కరెన్సీ పిక్చర్స్ రాజు స్వాగతం పలికారు. నందమూరి అభిమానుల సంఘం నాయకుడు గొర్రెల రమణ తదితరులు పాల్గొన్నారు. తండ్రీ కూతుళ్లు ఎవరైనా సినిమాకు వచ్చారా అంటూ దర్శకుడు అనిల్ రావిపూడి ప్రస్తావిస్తూ, ముగ్గురిని వేదికపైకి ఆహ్వానించి, సినిమా గురించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి సినిమాలో వివరించామని, ప్రతి ఆడపిల్లకూ ఈ చిత్రం చూపించాలని కోరారు.

సాయికుమార్‌కు పతకాలు



సాయికుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రాజానగరం: గైట్ కళాశాలలో ఎంబీఏ చదువుతున్న ఎ.సాయికుమార్ పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి బంగారు, వెండి పతకాలను సాధించాడని ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ తెలిపారు. అమలాపురంలో తోరం రమేష్ స్మారకం సందర్భంగా పురుషులు, మహిళల విభాగాలలో హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్, కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహించాయన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: వెల్డింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన శాటిలైట్ సిటీ ఏ బ్లాక్‌లో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం శాటిలైట్ సిటీ ఏ బ్లాక్‌కు చెందిన నిడదవోలు ప్రసాద్ (38) గ్రామంలోనే వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ప్రసాద్, మరో వ్యక్తి కలిసి గ్రైండిగ్ మిషన్‌తో వెల్డింగ్ చేస్తున్నారు. కింద కూర్చుని ఉన్న ప్రసాద్‌కు పనిచేస్తున్న మరో వ్యక్తి మిషన్ ఇచ్చాడు. అయితే ప్రసాద్ ఇనుప కమ్మెలపై కూర్చోవడంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య వీరలక్ష్మి ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై మహమ్మద్ జుబేర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ట్రాఫిక్ సీఐలుగా మధుబాబు, రామకృష్ణ

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ట్రాఫిక్ సీఐలుగా మధుబాబు, రామకృష్ణ నియమితులయ్యారు. మధుబాబు గతంలో త్రీటౌన్ సీఐగా పనిచేశారు. వీఆర్‌లో ఉన్న వీరిద్దరినీ నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

10,220 మందికి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా 20వ రోజు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 20 వైద్యశిబిరాలు నిర్వహించినట్లు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక తెలిపారు. వీటిలో 10,220 మంది రోగులు వైద్యసేవలు పొందగా, 147 మందిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశామన్నారు.